క్లుప్తంగా

75 శాతం పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ బుధవారం 75 శాతం పూర్తయింది. మండల పరిధిలో 9348 మంది లబ్ధిదారులకు గాను రూ.2,57,85,250లు నగదు పింఛను పంపిణీ చేయాల్సి ఉంది. తొలిరోజు 75 శాతం పంపిణీ చేశారు. తెల్లవారుజామున వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేశారు.

చిలకలూరిపేట మండలంలో 80 శాతం..

చిలకలూరిపేటటౌన్: ప్రతి నెలా ఒకటో తేదీ అందజేసే వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా బుధవారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేశారు. మండల పరిధిలో మొదటి రోజు 80.2 శాతం, పట్టణ పరిధిలో 65 శాతం పింఛన్ అందించారు. మిగిలిన వారికి తదుపరి రోజుల్లో పింఛన్ చేయనున్నట్లు చెప్పారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నాగినీడు సైదమ్మ భర్త గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులో ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. భర్త దగ్గర సహాయంగా ఉన్న దివ్యాంగురాలైన సైదమ్మ ఇబ్బందులను గుర్తించి వలంటీర్ వడిచర్ల రాజేశ్వరరెడ్డి బుధవారం గుంటూరు వెళ్లి పింఛన్ అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న దివ్యాంగురాలి కుటుంబానికి గుంటూరు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్ రాజేశ్వరరెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

వినుకొండ(నూజెండ్ల): సచివాలయ సిబ్బంది ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎల్‌డీఓ వెంకటరెడ్డి తెలిపారు. నూజెండ్ల సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా పథకాల అమలు తీరు, అటెండెన్స్, తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేయాలని సూచించారు.

వర్గీకరణ విషయంలో కేంద్రానిది నిర్లక్ష్య వైఖరి

చిలకలూరిపేట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరుపై మాదిగ జాతి పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా కన్వీనర్ అద్దంకి బాబుమాదిగ కోరారు. మాదిగల సంగ్రామ పాదయాత్ర బుధవారం చిలకలూరిపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ముందుగా పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగలను నమ్మించి మోసం చేసిందన్నారు. కొర్నెపాటి మల్లిక, కొండపాగ క్రాంతి, ప్రత్తిపాటి కోటి, కేశనపల్లి కిషోర్, కోటా చంటి తదితరులు పాల్గొన్నారు.

యజమానుల సమక్షంలోనే రీసర్వే

అధికారులకు స్పష్టం చేసిన పల్నాడు జిల్లా జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్



కంప్యూటర్‌లో రీసర్వే అంశాలను పరిశీలిస్తున్న జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్

యడ్లపాడు: పల్నాడు జిల్లా జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్ యడ్లపాడు మండల రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం సందర్శించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష కార్యక్రమం ప్రగతి అంశాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. మండలంలో ప్రస్తుతం రెండో విడత రీసర్వే కొనసాగుతున్న రెవెన్యూ గ్రామాలైన వంకాయలపాడు, తుర్లపాడు, తిమ్మాపురం రికార్డు నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సర్వేబృందాలను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో 9(2) నోటీసులు రైతులకు పంపిణీ చేశారా..వాటిని అందుకున్న రైతుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వచ్చాయా అంటూ ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వే చేసే ప్రతి భూమి యజమానికి తప్పని సరిగా నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో రీసర్వే పారదర్శకంగా కొనసాగించాలని ఆదేశించారు. అలాగే రీసర్వే అంశాలు గ్రామస్తులు తెలిసే విధంగా ఆయా గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రీసర్వేకు సంబంధించిన రికార్డులు, విధుల నిర్వహణ రికార్డులు, రీసర్వే ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. ఇప్పటికే రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో భూ హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తున్న విషయాలపై వీఆర్వోలు, సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యడ్లపాడు తహసీల్దార్ ఎస్ నాగమల్లేశ్వరరావు, డీటీ శ్యామలత, మండల సర్వేయరు రాంబాబు, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు

నాదెండ్ల: జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష కార్యక్రమంలో భాగంగా రీసర్వే పూర్తయి హక్కుపత్రాలు అందజేసిన గ్రామాల్లో బుధవారం హద్దురాళ్లు వేసే కార్యక్రమం ప్రారంభించారు. కనపర్రు, చిరుమామిళ్ల, సంకురాత్రిపాడు, బుక్కాపురం గ్రామాల్లో రీసర్వే పూర్తయి రైతులకు భూహక్కు పత్రాలు అందించారు. ఈ గ్రామాల్లో పెగ్‌మార్కు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుక్కాపురంలో శాశ్వత హద్దురాళ్లు వేస్తున్న పనులను బుధవారం తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ అనురాధ, సర్వేయర్ ఎ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి వీఆర్‌ఓ మరియదాసు పరిశీలించారు. గురువారం కనపర్రులో హద్దురాళ్లు వేయనున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

చేసిన మేలును ఇంటింటికీ చెప్పండి

సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేసి వచ్చే 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఒకటో వార్డు నుంచి 17వ వార్డుకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని పట్టణంలోని జమిందారు ఫంక్షన్‌హాలులో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఒక గ్రూపుగా ఏర్పడి ప్రతి ఇంటికి తిరుగుతూ జగనన్న అమలుచేస్తున్న సంక్షేమపథకాలను ప్రచారం చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ చెప్పిన విధంగా 175 అసెంబ్లీ సీట్లకు 175 గెల్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. పల్నాడు జిల్లా డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, సీనియర్ నాయకుడు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, షేక్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆషాబేగం ఖాజావలి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరక్టర్ ఎస్.సుజాతాపాల్, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.ఎ.హనీఫ్, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జిలు ఎస్‌కే ఆంజనేయులు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్లు పాలపర్తి వెంకటేశ్వర్లు, మాడిశెట్టి మోహనరావులు మాట్లాడారు. సీనియర్ బీసీ నాయకుడు బోయన సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, జి.అచ్యుతరావు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నూతన శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు సామాన్య ప్రజలకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు పారదర్శకంగా అందించటం అభినందనీయని నియోజకవర్గ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కారుమంచి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంకు శాఖను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, నరసరావుపేట రీజనల్ మేనేజరు పి.మారుతీరామ్, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ డిపాజిట్స్‌పై అత్యధికంగా వడ్డీరేటు ఇస్తున్న ఏకైక ప్రభుత్వరంగ బ్యాంకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అని అన్నారు. బొల్లాపల్లి మండలంలో ఏటీఎం సెంటరు ఏర్పాటు చేయటం బ్యాంకు సేవలకు నిదర్శమన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ నరసరావుపేట రీజనల్ పరిధిలో 61వ నూతన బ్రాంచ్ శాఖను ప్రారంభించడం జరిగిందన్నారు. బడుగు బలహీన వర్గాలకు, చిన్న, సన్నకారు రైతులకు ఆర్థికంగా చేయూత నిస్తూ గ్రామీణ బ్యాంకు శాఖల్లో ప్రథమస్థానం ఉందన్నారు. 8 జిల్లాల పరిధిలో 241 బ్యాంకు శాఖల ద్వారా రూ.7670 కోట్లు పైగా డిపాజిట్స్ సేకరించటంతో పాటు రూ.9300 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. రూ. 200 కోట్ల లాభాల బాటలో అందరి సహకారంతో బ్యాంకు పయనిస్తుందన్నారు. అనంతరం ఖాతాదారులకు పాసుపుస్తకాలు అందజేశారు. ఈకార్యక్రమంలో బ్యాంకు మేనేజరు కావూరి సాయిచంద్ర చౌదరి, ప్రాంతీయ కార్యాలయ బ్యాంకు అధికారులు చంద్రశేఖర్, రాంబ్రహ్మం,సుబ్రమణ్యం కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, సొసైటీ అధ్యక్షులు బొల్లా వెంకట సాంబశివరావు, వుట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సంక్షేమ లబ్ధి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు గడప గడపకు చేరుతూ ప్రతి ఇంటి సంక్షేమం విరాజిల్లుతున్నాయని నియోజకవర్గ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన గంటావారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని, ఇంటింటి తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకొని నవరత్నాల బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కారానికి కృషి చేశారు. సర్పంచి రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు తూమాటి కబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు స్వర్ణాల వెంకట్రావు, ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, రాష్ట్ర కాపుయువసేన అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు, మలిశెట్టి నరేష్, తేలప్రోలు రాఘవేంద్రరావు, బీర్నేడి రత్నగిరి, చెన్నా శ్రీనివాసరావు (సీఎస్ఆర్)పుట్టా లక్ష్మీనారాయణ, పోలూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

1156మంది టైలర్లకు రూ.1.15కోట్లు లబ్ధి

టైలర్స్‌డేలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలో చేదోడు పథకం కింద గత మూడేళ్లలో 1156 మంది టైలర్లకు రూ.1.15కోట్లు ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. టైలర్స్ డే సందర్భంగా మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్లో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన 40వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో చేదోడు పథకం ద్వారా టైలర్ వృత్తిలో ఉన్న కుటుంబాలకు సంవత్సరానికి రూ.పదివేలు చొప్పున గడిచిన మూడు సంవత్సరాల నుంచి అందజేస్తుందన్నారు. ఈసందర్భంగా పలువురు టైలర్లను సన్మానించారు. క్లాత్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అత్తులూరి వెంకటేశ్వర్లు, నిడమానూరి సురేంద్ర, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: పట్టణంలోని ఎస్ఎంఎస్ షాదీఖానాలో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు నిరుపేద టైలర్లకు ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా ఆర్థిక సహాయం అందజేశారు.

కుంగ్‌ఫూలో గణపవరం విద్యార్థుల సత్తా



విజేతలైన విద్యార్థులతో గ్రాండ్‌మాస్టర్ కమాల్ బాష, ట్రైనర్లు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ స్కూల్ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూలో శిక్షణపొందుతున్న విద్యార్థులు చాంపియన్‌షిప్ పోటీల్లో ఘన విజయం సాధించారు. గత నెల 26వ తేదీన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో వైఎంకే ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పలు విభాగాల్లో బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. కట, స్పారింగ్ విభాగాల్లో ఐ.షణ్ముఖి, వి.అచ్చయ్యలు బంగారు పతకాలు, ఎస్.జశ్వత్‌రెడ్డి, అమూల్య, షేక్ నసీమ, జె.కుశాల్ సాయి, జి.లోకేష్‌లు వెండి పతకాలు సాధించారు. చైతన్యరెడ్డి, ఎస్.లౌక్యశ్రీ, ఎ.షణ్ముఖప్రియ, షేక్ హుస్సేన్, కె.ప్రశాంత్‌రాజ్ రజత పతకాలను సాధించారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ ఎస్ఎం కమాల్‌బాష మాట్లాడుతూ, విద్యార్థులు కృషి, పట్టుదలతో తర్ఫీదు పొంది పతకాలు సాధించారన్నారు. ఆరేళ్ల షణ్ముఖి, ఏడేళ్ల అచ్చయ్యలు బంగారు పతకాలు సాధించటం అభినందనీయమన్నారు. వీరికి శిక్షణనిస్తున్న మాస్టర్స్‌ను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి సాగు చేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురికారని, పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందన్నారు. తద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులు అందించే దిశగా కృషిచేయాలని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది తమ పొలాల్లో 21రకాల విత్తనాలను బీజామృతం విత్తనశుద్ధి చేసి పొలంలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంటీలు జగదీష్, ఓంకార్, మనోజ్, నందకుమార్, సైదయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సర్వీసులు

వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 7వ తేదీ మహాపౌర్ణమి మంగళవారం సందర్భంగా అరుణాచలం స్వామి వారి దర్శనం, గిరిప్రదక్షిణం చేసుకునేందుకు వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావునాయక్ బుధవారం తెలిపారు. వినుకొండ డిపో నుంచి మార్చి 5వ తేదీ రాత్రి 9గంటలకు బయలుదేరి 6వ తేదీ ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం వినాయక దర్శనం, సాయంత్రం 6గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్ చివరిగా 7వ తేదీ ఉదయం 5గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. తిరిగి 8వ తేదీ ఉదయం 4గంటలకు వినుకొండకు చేరుకుంటారన్నారు. వినుకొండ ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టిక్కెట్ ధర రూ.2750లు ఉంటుందని, ముందస్తుగా రిజర్వేషన్ సదుపాయం ఉందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7382896046, 7382898227 నంబర్లను సంప్రదించాలన్నారు.

సీజనల్ వసతి గృహాలు ప్రారంభం

వినుకొండ టౌన్: వలస కుటుంబాల చిన్నారుల కోసం సీజనల్ వసతి గృహాలను పల్నాడు జిల్లా సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు పట్టణంలోని పాములకాలనీ, వినుకొండ రూరల్ ఏనుగుపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రారంభించడం జరిగిందని ఎంఈఓ సయ్యద్ జప్రూల్లా బుధవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస కుటుంబాలలోని చిన్నారుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వం ఈ గృహాలను ఏర్పాటు చెయ్యడం జరిగిందని, నరసరావుపేటకు చెందిన ఆగ్నస్ గాంజా బోజక్షియో సోషల్ సర్వీస్ సొసైటీ ఈ వసతి గృహాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులందరితో తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేసి, చిన్నారులకు వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. పాముల కాలనీ పరిధిలో 54మంది చిన్నారులను, ఏనుగుపాలెం పరిధిలో 50మంది చిన్నారులను గుర్తించడంతో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈ కేంద్రాలు 2023 ఏప్రిల్ 30 వరకు నిర్వహిస్తామన్నారు. హెచ్ఎంలు శ్రీనివాసరెడ్డి, ఎలీషా, సొసైటీ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో వీధి కుక్కలు ఆరేళ్ల బాలుడిని చంపిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినుకొండ పట్టణంలో వీధి కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డు, హనుమాన్‌నగర్, కారంపూడి రోడ్డులతో పాటు పలు ప్రాంతాల్లో తొలిరోజు 50 కుక్కలకు పైగా పట్టుకున్నారు. పట్టణం మొత్తం అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధికుక్కలను పట్టుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

'శుభకృత్'పై సమీక్ష

ఈపూరు: శుభకృత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో వృథాగా పడి ఉన్న ఫర్నీచర్‌ను సేకరించి వేలం వేయడం జరుగుతుందని జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ అధికారి విజయభాస్కరరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో డీపీఓ మాట్లాడుతూ శుభకృత్‌లో కార్యక్రమంలో భాగంగా వేలం ద్వారా వచ్చిన నిధులతో పంచాయతీల్లో ఆర్థిక సమస్యలు తీరి మౌలిక వసతులను అభివృద్ధి పరచుకోవచ్చన్నారు. గ్రామ పంచాయతీల్లో ఈ నెల 20వ తేదీ కల్లా నూరుశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. జిల్లాలో రూ.25,95,27,939లు డిమాండ్ ఉండగా రూ.12,92,30,969లు ఇప్పటి వరకు వసూలు చేశామన్నారు. ఎంపీడీఓ ఉషాకిరణ్, ఈఓపీఆర్‌డీ రమేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ట్రాన్స్‌జెండర్ మృతి

నాదెండ్ల: ఈ నెల 25న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ట్రాన్స్‌జెండర్ గీత (38) మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్తెనపల్లిలోని గండ్లూరు గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ గీత అలియాస్ గోపి ఆరు నెలల నుంచి గణపవరంలోని రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉంటోంది. ఈ నెల 25న రాత్రి 9 గంటల సమయంలో చిలకలూరిపేట నుంచి ఆటోలో వచ్చి రాజీవ్‌గాంధీకాలనీ వద్ద జాతీయ రహదారిని దాటే క్రమంలో గుర్తుతెలియని కారు ఢీకొంది. తీవ్రగాయాలైన గీతను 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి బాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రతిష్ఠా మహోత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన బింబప్రతిమలకు పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి ఆలయ పరిసరాల్లోకి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ధ్వజస్తంభాన్ని భక్తులతో కలిసి మోశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో రుత్వికులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా పోలయ్య

వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేటలో ఇటీవల జరిగిన యూటీఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో పనిచేస్తున్న ఎం.పోలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా జడ్పీహెచ్ బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు యు.రామాంజమ్మలు ఎన్నికయ్యారు. ఈ మేరకు వినుకొండప్రాంతీయ కార్యాలయంలో బుధవారం జరిగిన అభినందన సభలో నూతనంగా ఎంపికైన ఇరువురికి స్థానిక నాయకులు అభినందించారు. యూటీఎఫ్ వినుకొండ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు టి.వి. హనుమంతసూరి, పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

వాటర్‌గ్రిడ్ నిర్మాణానికి సర్వే

బొల్లాపల్లి: పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ, మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లోని మండలాలకు తాగునీటి అవసరాల కోసం వాటర్‌గ్రిడ్ మంజూరైందని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు వినుకొండ గ్రామీణ నీటిసరఫరా విభాగం డీఈఈ ఆర్.ఎస్.హెచ్.హెచ్. కుమార్ రాజ్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం గ్రిడ్ నిర్మాణం కోసం నియోజకవర్గంలోని మండలాల్లో సర్వే జరుగుతుందని తెలిపారు. కృష్ణా నది నీటిని మాచర్ల, కారంపూడి మండలాల నుంచి బొల్లాపల్లి, ఈపూరు, వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాలకు నీటిసరఫరా జరుగుతుందన్నారు.

